నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శనివారం | ఆగస్టు 24, 2024 | www.navatelangana.com

# నిర్మించిన చోటే..నిర్వీర్యం..!

- పెచ్చులూడి.. శిథిలమవుతున్న డబుల్‌బెడ్‌రూమ్‌లు
- లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు
- ఏడాది గడుస్తున్నా పంపిణీకి నోచుకోని వైనం
- నిర్మాణానికి వెచ్చించిన రూ.కోట్లు నిధులు వృథా

**ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివసించే పేదలకు పంపిణీ చేసేందుకు నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. రూ.కోట్లు వెచ్చించిన నిర్మాణాలు కట్టిన చోటే నిర్వీర్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. నిర్మించి ఐదేండ్లు గడుస్తున్నా..వాటిని పంపిణీ చేసేందుకు మాత్రం అధికార యంత్రాంగం ముందుకు రావడం లేదు. గతేడాది ఈ ఇండ్లను కేటాయించేందుకు లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ అర్థాంతరంగా నిలిచిపోయింది. కేవలం 32వార్డులకు మాత్రమే లాటరీ నిర్వహించిన అధికారులు మిగితా వార్డులకు సంబంధించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఎంపిక చేసిన లబ్ధిదారులకు వీటిని కేటాయించలేక..పూర్తిగా లాటరీ ప్రక్రియ చేపట్టలేక అలాగే ఉండిపోతున్నాయి. రంగులు వేసి ముస్తాబు చేసిన ఈ ఇండ్లు ఆలనాపాలన లేకపోవడంతో నిర్మించిన చోటే శిథిలమవుతున్నాయి. ప్రస్తుతం వీటిపై కొత్త ప్రభుత్వంతో పాటు అధికారులు సైతం దృష్టిసారించకపోవడం మూలంగా రూ.కోట్ల నిధులతో నిర్మించిన ఈ ఇండ్లు వృథాపాలవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.**



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేదలకు పంపిణీ చేసేందుకు గత ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్‌రూంలు నిర్మించింది. స్థలాభావ సమస్యల కారణంగా సుమారు ఐదు నుంచి పదేకరాల స్థలాలను గుర్తించి ఒకే చోట అపార్ట్‌మెంట్ల రూపంలో వీటిని నిర్మించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కేఆర్‌కే కాలనీతో పాటు కొత్త హౌసింగ్‌బోర్డు ప్రాంతంలో వీటి నిర్మాణం చేపట్టారు. గత ప్రభుత్వం ఏర్పడిన ఒకటి, రెండేండ్లకు ప్రారంభించిన ఈ ఇండ్ల నిర్మాణాలు ఆగుతూ..సాగుతూ ఏండ్లుగా కొనసాగాయి. నిధుల కొరత సమస్యల కారణంగా రోజుల తరబడి పూర్తికాకుండానే మిగిలిపోయాయి. ఎట్టకేలకు రెండేండ్ల క్రితం పూర్తిచేసిన అప్పటి ప్రభుత్వం వీటిని పట్టణ పరిధిలోని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని భావించింది. ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానించగా.. పట్టణ పరిధిలో 7902 మంది దరఖాస్తులు చేశారు. వీటిని క్షేత్రస్థాయిలో విచారించిన అధికారులు ఇందులో 2538 మందిని అర్హులుగా గుర్తించారు. వీరి కోసం లాటరీ నిర్వహించి ఎంపిక చేసినా లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించలేకపోయారు.

**అసంపూర్తిగానే ఎంపిక ప్రక్రియ..!**

జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలను పంపిణీ చేయాలని అర్హులతో పాటు అనేక డిమాండ్లు వినిపించాయి. దీంతో అధికారులు కిందటేడాది మే నెలలో లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. పట్టణ పరిధిలో 49వార్డులు ఉండగా తొలి విడతలో కేవలం 32వార్డులకే ఎంపిక చేపట్టారు. కులాలు, రిజర్వేషన్ల వారీగా 618మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు మిగితా వార్డులకు సంబంధించి మలి విడత చేపడతామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. దీంతో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించకపోగా.. మిగితా వారికి కూడా ఎంపిక చేయకుండా కాలయాపన చేస్తుండటంతో ఎంపికైన లబ్ధిదారుల్లోనూ అయోమయం నెలకొంది. మిగితా అనేక మంది అర్హులు సొంతింటి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

**శిథిలమవుతున్న భవనాలు..!**

జిల్లా కేంద్రంలోని అనేక మంది పేదలు రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సొంతిల్లు లేక అనేక మంది అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక భారాన్ని భరిస్తున్నారు. మరికొంత మంది శివారు కాలనీల్లో రేకుల షెడ్లు, గుడిసెలు వేసుకొని ఏండ్ల తరబడి ఇక్కడే ఉంటున్నారు. పట్టణంలో చిన్న చితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సొంతింటి కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్నా వారి ఆశలు నెరవేరడం లేదు. మరోపక్క ప్రస్తుతం నిర్మించిన ఇండ్లకు రంగులు కూడా వేసి అందంగా ముస్తాబు చేశారు. కానీ పంపిణీ చేయకపోవడంతో ఏండ్ల తరబడి నిరూపయోగంగా ఉంటున్నాయి. వాటి నిర్వహణ లేకపోవడంతో అనేక ఇండ్లకు కిటికీలు విరిగిపోయి..తలుపులు పగిలిపోయాయి. మరి కొన్నింటికి పెచ్చులూడిపోవడంతో నిర్మించిన చోటే నిర్వీర్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మరోపక్క రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వీటి పంపిణీపై అయోమయం నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ఇండ్లపై నిర్ణయం తీసుకుంటే అనేక మంది పేదలకు ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## 8 నెలల వేతనాలు చెల్లించాలని వినతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎనిమిది నెలల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శివ బాలాజీ అవుట్ సోర్సింగ్ కార్మికులు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామ శివ బాలాజీ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలో రెండు సంవత్సరాలుగా పని చేస్తున్నామని, ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ విషయమై ఏజెన్సీ నిర్వాహకులకు, ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి బకాయి జీతాలు చెల్లించడంతో పాటు ప్రతినెల జీతం పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



## విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

నవతెలంగాణ-నస్పూర్

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయించిన విధులను అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీకళ శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖాపరంగా కేటాయించిన విధులను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. శ్రీకళ నిర్మల్ జిల్లా నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు.



## సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వాటా చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వాటా చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ స్టోర్స్, టింబర్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ సమావేశంలో బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్‌తో కలిసి మాట్లాడారు. సింగరేణి సంస్థలో 25వేల మంది పైచిలుకు కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల జీవితాలు శ్రమ బారెడు వేతనాలు మూరెడు అన్న చందంగా ఉన్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. కొన్ని సంవత్సరాల నుండి పోరాటాలు చేస్తున్న యాజమాన్యం వేతనాలు పెంచడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల పనికి తగ్గ వేతనాలు చెల్లించాలన్నారు. ఒకే కుటుంబం ఒకే లక్ష్యం ఒకే గమ్యం అనే సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై సవితి తల్లి ప్రేమను చూపిస్తుందని, సింగరేణి సంస్థ లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ కూడా ప్రత్యేకంగా ఉందని తెలిపారు. అందుకని సంస్థ లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాట చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం బ్రాంచ్ కార్యదర్శి బూర వీరేశం, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కాతరాజు ప్రభాకర్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి సురేంద్రచారి, నాయకులు రాజు, శ్రీను పాల్గొన్నారు.

## ఎస్పీఎం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- లేబర్ కమిషనర్‌ను కోరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కార్మికశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో కార్మికశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, జాయింట్ కమిషనర్ సునీతను కలిసి మిల్లు యాజమాన్యం అవలంబిస్తున్న విధానాలను వారికి వివరించారు. ఆరేళ్లుగా మిల్లులో గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించడం లేదని, దీంతో కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. స్థానికులను కాదని, స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మిల్లు సొసైటీ డబ్బుల జమ, అప్పుల వివరాలపై ప్రభుత్వ అధికారి సమక్షంలో విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎస్పీఎం పర్మినెంట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈర్ల సతీష్‌కుమార్ తెలిపారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నూతన కమిటీ ఎన్నికకు సంబంధించి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించగా పాత కమిటీనే కొనసాగించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా విద్యాశాఖలో అతి తక్కువ వేతనాలతో సేవలు అందిస్తున్నామన్నారు. గతంలో తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ప్రస్తుత సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. 9 నెలలు గడుస్తున్న కనీసం హామీ అమలు దిశగా అడుగులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో రకాల సమస్యలతో సతమతమవుతున్నట్లు వివరించారు. వీటితోపాటు అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ఉద్దేశంతో ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట ఒకరోజు నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, కోశాధికారి బోయిని నగేష్, అధికార ప్రతినిధి పవన్, మీడియా ప్రతినిధి గేడెకార్ సంతోష్, కార్యదర్శి దుర్గం సందీప్, వెంకటరమణ, నాయకులు మహేష్, దేవేందర్, సత్యనారాయణ, గందె రమేష్, రాజేష్, రాజకుమార్, చిట్ల తిరుపతి, ఆనంద్, శృతిక, స్వప్న పాల్గొన్నారు.

## పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళా శక్తి పథకం ద్వారా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి కాగజ్‌నగర్ మండలం, మున్సిపాలిటీలో పర్యటించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండల సమైఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలచే ఏర్పాటు చేయనున్న బల్క్ మిల్క్ సెంటర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మీ సేవా కేంద్రాలు, పౌల్ట్రీ ఫాంలు, చేపల పెంపకం, డైరీ ఫాం, క్యాంటీన్ల ఏర్పాటు తదితర అంశాలను మహిళా శక్తి పథకంలో పొందు పర్చారని తెలిపారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి పథకం ద్వారా మహిళలకు రుణ సదుపాయం కూడా కల్పించి వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు.

**పలు అభివృద్ధి పనుల పరిశీలన**

అనంతరం కలెక్టర్ మున్సిపాలిటీకి సంబంధించిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎస్‌జీటీఎస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న డీఆర్‌సీసీ సెంటర్‌ను పరిశీలించారు. మున్సిపల్‌పరిధిలో ఏర్పాటు చేయనున్న ఏబీసీ (అనిమల్ బర్త్ సెంటర్)ని కూడా పరిశీలించి, తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, డీఈ రమాదేవి, తహసీల్దార్ కిరణ్, జిల్లా పశువైద్యాధికారి సురేష్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## పిల్లల సమగ్ర ఎదుగుదలకు కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి సిడిపిఓలు, సూపర్వైజర్లు, పిరామిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎస్ఎస్ఎఫ్ఎస్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ఈ క్రమంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించడంతో పాటు పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో టిహెచ్ఆర్, హెచ్‌సిఎం వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో 100 శాతం నమోదు చేయాలని, అంగన్వాడి కేంద్రాలలోని పిల్లల ఎత్తు, బరువులను సకాలంలో నమోదు చేస్తూ పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన సదుపాయాల కల్పన కొరకు పూర్తి వివరాలుతో నివేదిక రూపొందించి అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త గోపాలకృష్ణ, సిడిపిఓలు, సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ బ్లాక్ సమన్వయకర్తలు, పిరామిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్ఓఆర్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్





నవతెలంగాణ-నిర్మల్

ఆర్ఓఆర్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతన ఆర్ఓఆర్ చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో భాగంగా రెవెన్యూ అధికారులు, రిటైర్డ్ అధికారులు, న్యాయ నిపుణులతో ఆర్ఓఆర్ బిల్లుపై విస్తృతంగా చర్చించారు. ఆర్ఓఆర్ బిల్లుపై అధికారులు, న్యాయ నిపుణుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కొత్త ఆర్ఓఆర్ చట్టం కాపీని ఇదివరకే సిసిఎల్ఏ వెబ్‌సైట్‌లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచారని, తద్వారా ప్రజల నుండి సలహాలు, సూచనలు స్వీకరించడానికి అవకాశం కల్పించారని అన్నారు. ఆర్ఓఆర్ బిల్లుపై ప్రజలకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని ఆదేశించారు. బిల్లులో గల అంశాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల నుంచి ఆర్ఓఆర్ బిల్లుపై సలహాలు సూచనలను స్వీకరించాలని తెలిపారు. అధికారులు తమ రోజు వారి విధుల్లో భాగంగా ఇంతకు ముందున్న 2020 చట్టంలో ప్రజల నుంచి ఎన్నో ఫిర్యాదులను స్వీకరించారని, ఈ క్రమంలో ఎదురైన అనుభవాల ద్వారా కొత్త ఆర్ఓఆర్ బిల్లులో గల అంశాలను అవగాహన పరుచుకోవాలని తెలిపారు. ఆర్ఓఆర్ చట్టం బిల్లుకు సంబంధించి వివరణలు, నిర్వచనాలు ఇతర అంశాలను అధికారులతో చర్చించారు. ప్రతి ఒక్క అధికారి ఆర్ఓఆర్ పోర్టల్ గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ భుజంగ్‌రావు, నిర్మల్, ముధోల్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులు, ఇతర రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ - హాజీపూర్

మండలంలోని ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. వంట గదితో పాటు నిత్యావసర సరుకులు, ఆహార సామాగ్రిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాలలోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేసేలా చూడాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి, మరమ్మత్తు పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విషజ్వరాల బారిన పడకుండా పాటించాల్సిన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రపరచుకునేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.మోహన్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ప్రయివేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తా : ట్రస్మా జిల్లా అధ్యక్షులు ఎండి అజీజ్

నవతెలంగాణ-మందమర్రి

ప్రయివేటు పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తానని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఎండి అజీజ్ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి మండల ట్రస్మా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ట్రస్మా మండల అధ్యక్షునిగా వి.శ్యాంకుమార్, ప్రధాన కార్యదర్శిగా లత, ట్రెజరర్‌గా సారంగరావును నియమించారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు సమ్మిరెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రాజేంద్రపాణి, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ డి.రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవన్న పాల్గొన్నారు.

## విద్యార్థులకు తరగతులు నిర్వహించాలి

నవతెలంగాణ-ముధోల్



మండల కేంద్రంలో కొత్తగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు తరగతులు ప్రారంబించాలని ముధోల్ మాజీ సర్పంచ్ వెంకటాపురం రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ముధోల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బుచ్చయ్యకు, భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు. ముధోల్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను నియమించి, తరగతులను ప్రారంభించాలని కోరారు. కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న సోను

నవతెలంగాణ-నిర్మల్



అత్యవసర పరిస్థితిలో ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తాన్ని అందించి, రక్త దాతగా జిల్లా కేంద్రానికి చెందిన సోను రాజ్‌పుత్ నిలిచారు. భైంసా పట్టణానికి చెందిన నిండు గర్భిణీ అయినా అరిషియ ఖానంకు ఏ నెగిటివ్ బ్లడ్ డోనర్ కోసం జైహింద్ అనే వాట్సాప్ గ్రూప్‌లో అత్యవసరంగా రక్తం కావాలంటూ మెసేజ్ వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు అజర్ ఖాన్ వెంటనే స్పందించి డోనర్ కోసం వెతకగా వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చూసిన సోను రాజ్‌పుత్ వెంటనే స్పందించి ఆ నిండు గర్భిణీకి శుక్రవారం రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించడంతో ఓ నిండు ప్రాణాన్ని కాపాడి మానవత్వం చాటుకున్నాడు.

# ఆంగ్ల సాక్షరత పెంపొందించేందుకు కృషి

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన పాఠశాలలో ఆంగ్ల సాక్షరత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో పీఓని కలిసి ఒప్పంద పత్రాన్ని అందజేశారు. పీఓ మాట్లాడుతూ విద్యా ఫలితాలను మెరుగుపర్చేందుకు ఈ ఒప్పందం కింద ఆంగ్ల సాక్షరత కార్యక్రమం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని గిరిజన పాఠశాలల్లో అమలు చేస్తున్నామన్నారు. ఈ ఒప్పందం తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారి కుదుర్చుకోవడం విశేషమన్నారు. ముఖ్యంగా ఐటీడీఏ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపర్చడమే దీని లక్ష్యమని అన్నారు. ఇఎల్పీ అనేది సరికొత్త, సాంకేతికత ఆధారిత పద్ధతితో రూపకల్పన చేయబడిన కార్యక్రమన్నారు. ఇది విద్యార్థులలో చదవడం, స్పెల్లింగ్, అర్థం చేసుకోవడం, వాక్య నిర్మాణం వంటి నైపుణ్యాలను మెరుగుపర్చడానికే ఉందన్నారు. ప్రత్యేకంగా 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూపొందించబడిందన్నారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, వీరనారాయణ (విజయవాడ), చైతన్య చక్రవర్తి (విజయవాడ), ప్రనిల్ నాయక్ (ముంబై), క్షితిజ్ (బెంగళూరు) పాల్గొన్నారు.



ఆంగ్లసాక్షరత ఒప్పందాన్ని కుదుర్చుకున్న పత్రాన్ని చూపిస్తున్న ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా



ఫాగింగ్ మిషన్‌తో దోమల మందు స్ప్రే

**ప్రభుత్వ పాఠశాలల్లో దోమల నివారణకు చర్యలు**

ప్రభుత్వ పాఠశాలల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి, దోమల మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడారు. వర్షాకాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా, వంటి వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిల్వకుండా చూడాలని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణకుగానూ ఒక్కొక్క ఏటీడీఓ పాయింట్‌కు ఒకటి చొప్పున మొత్తం ఎనిమిది ఫాగింగ్ మిషన్‌లను సరఫరా చేశారు. ఒక వారం రోజుల్లో అన్ని పాఠశాలలలో ఫాగింగ్ పూర్తి చేసే విధంగా ప్రణాళిక తయారు చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధి సోకిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అన్ని ఆశ్రమ పాఠశాల విద్యార్థులను గుర్తించి, వెంటనే చికిత్స చేయించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ఏటీడీఓలను ఆదేశించారు. ఇంకేమైనా వివరాలు కావలిస్తే సమీప ఏటీడీఓలను సంప్రదించాల్సిందిగా తెలిపారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పదు



నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పదని, మడమ తిప్పదని కాంగ్రెస్ నిర్మల్ మండలాధ్యక్షులు ఎంబరి గంగాధర్ అన్నారు. శుక్రవారం నిర్మల్ మండలంలోని ముజ్గి గ్రామంలో రైతుల నుంచి పంట రుణమాఫీ కోసం వ్యవసాయ విస్తరణ అధికారి అంబాజీ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంబరి గంగాధర్ మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం రుణమాఫీ చేసి తీరుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు పొలాస మల్లేష్, ముజ్గి మాజీ ఎంపీటీసీ బోత్కూరి సంతోష్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ పడిగెల నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రుణమాఫీకాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని రైతు వేదికలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వాకర్ అహ్మద్ రూ.2 లక్షలలోపు రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఇప్పటి వరకు రెండు వందల దరఖాస్తు స్వీకరించినట్టు ఏఓ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఫిర్యాదులు తీసుకుంటున్నట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అరుణ్ కుమార్, ఉమేష్, లక్ష్మీ, సుప్రియలు ఉన్నారు.

## బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్ఓ డా.కృష్ణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కూడా బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ సూచించారు. ఫ్రైడే, డ్రైడేలో భాగంగా శుక్రవారం హ్యాండిక్యాప్ కాలనీలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీరు లేకుండా చూడాలని అవగాహన కల్పించారు. టైర్లు, కూలర్లలో ఉన్న నీటిని పారబోయించి, స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ వర్షకాలంలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 79 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, రెండు, మూడు రోజుల్లో ఈ కేసులు అధికంగా నమోదయ్యాయని తెలిపారు. ప్రజలు కూడా బాధ్యతగా వారి ఆరోగ్య పరిరక్షణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ కార్యక్రమం కూడా విజయవంతం కాదని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీధర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

# కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-తాంసి




కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణమే వేసి, రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని కోరుతూ శుక్రవారం తాంసి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల సీఐటీయూ క్యాడర్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని, హామీ ఇచ్చి ఇప్పటివరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని అన్నారు. అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వేతనాలు వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకముందు కార్మికులంతా సమ్మె చేస్తున్న క్రమంలో కాంగ్రెస్ నాయకత్వం సమ్మె టెంట్ల వద్దకు వచ్చి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తే కార్మికులందరికీ అమలు చేస్తామని మాట ఇచ్చారన్నారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇస్తామని మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు అమలు చేస్తానని, అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైన కార్మికుల డిమాండ్లను పరిష్కారం చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ రూ.2లక్షలు ఆగస్టు 15లోగా మాఫీ చేస్తానని, హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదు. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామ రైతుల రుణమాఫీ రూ.2లక్షలు అమలు చేయాలని ధర్నా చేస్తే, వారిపైన అక్రమ కేసులు వేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారిపై పెట్టినా కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శి డి.వెంకటమ్మ, భీంపూర్ మండల కన్వీనర్ ధోనిపెల్లి స్వామి, నాయకులు హైదర్, విలాస్, శ్రీనివాస్, ఇంద్రజ్, కళావతి, ప్రమీల, సరిత, విజయ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పారిశుధ్య పనులు, ఇంటింటా ఫీవర్ సర్వే



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో పరిశుభ్రతే లక్ష్యంగా మండల కేంద్రంలో అధికారులు ప్రత్యేకంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ జవహర్‌లాల్, ఎంపీఓ స్వప్నశీల, పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు వార్డుల్లో తిరుగుతూ డ్రైడే సందర్భంగా మురుగు కాలువ, కుళాయి, డ్రమ్‌లో టైరులో ఉన్న నీటిని పారబోయించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటా తిరుగుతూ ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేశారు. చెత్త చెదారం ఉన్న చోట పారిశుధ్య కార్మికులతో పనులు చేయించారు. వారి వెంట వైద్య సిబ్బంది లక్ష్మీ చరణ్‌దాస్, సతవ్వ, రాజమ్మ, సుశీల, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## పెన్షన్ విద్రోహ దినం విజయవంతం

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు



నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి పెన్షన్ విద్రోహ దినాన్ని పాటించి, విజయవంతం చేశారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులంతా వారి వారి పాఠశాలల్లో కార్యాలయంలో జీఓ నెంబర్ 28 ప్రతులను కాల్చివేసి నిరసన తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమీర్ ఖుశ్రు, రాజేశ్వర్, రవి జాదవ్, అంజయ్య, సాయికృష్ణ, స్వర్ణలత పాల్గొన్నారు.

# ఆర్ఓఆర్ ముసాయిదా చట్టంపై చర్చ



నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్ఓఆర్ ముసాయిదా చట్టంపై తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు హాజరయ్యారు. ఆర్ఓఆర్ చట్టంపై పలువురు సూచనలు, సలహాలు తెలియజేశారు. చట్టంను పకడ్బందీగా అమలు చేసి, పట్టాదారుకు ఇబ్బందులు కలుగకుండా చుడాలని ఎక్కువ సంఖ్యలో పలువురు తమ అభిప్రాయలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్ఓఆర్ ముసాయిదాను ఈ చర్చ కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివకుమార్, రిటైర్డ్ తహసీల్దార్ వెంకటి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు ధర్మపురి సుదర్శన్, సురేందర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, రైతు నాయకుడు గోపిడి ప్రేమ్‌నాథ్ రెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్, కిషన్ పతంగి, రమేష్, మైసాజీ, కిషన్ పటేల్, రైతులు పాల్గొన్నారు.

## భద్రతపరంగా పటిష్ట చర్యలు తీసుకోవాలి

- పదో రోజుకు రిమ్స్ జూడాల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోల్‌కతా ఘటన నేపథ్యంలో వైద్య కళాశాలల్లో రక్షణ, భద్రత పరంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని రిమ్స్ జుడా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కారుణ్య కోరారు. కోల్‌కతా ఘటనను నిరసిస్తూ రిమ్స్ జూడాలు చేపట్టిన నిరసన శుక్రవారం 10వ రోజు చేరుకుంది. నిరసన కార్యక్రమంలో భాగంగా రిమ్స్ ఆడిటోరియంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన మెడికోలను ప్రోత్సహిస్తు పండ్ల రసం అందించారు. ఈ సందర్భంగా రిమ్స్ జుడా ప్రధాన కార్యదర్శి మజోర్ కారుణ్య మాట్లాడుతూ కోల్‌కతా ఘటనలో తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందన్నారు. అదే విధంగా పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందన్నారు. రిమ్స్‌లో సమస్యలను డైరెక్టర్ తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కూడా రాష్ట్ర స్థాయిలో పరిష్కరించే వాటిని త్వరతగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జూడ అధ్యక్షుడు సందీప్‌చారి, ఉపాధ్యక్షుడు స్మజ్, అన్వేష్, మౌనిక పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

- సీఐ మొగిలి

నవతెలంగాణ-ఉట్నూర్



డిగ్రీ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దనీ ఉట్నూర్ సీఐ మొగిలి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో కేబీ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్‌తో పాటుగా సీఐ మొగిలి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మొగిలి మాట్లాడుతూ కళాశాలలో జూనియర్, సీనియర్ అనే తేడాలు లేకుండా అన్నదమ్ముల వలె ఉంటూ అధ్యాపకులు చెప్పిన విషయాలు శ్రద్ధగా విని ఆచరణలో పెట్టాలన్నారు. చిన్న చిన్న విషయాలతో గొడవలు పడొద్దన్నారు. తోటి స్టూడెంట్స్‌ని ర్యాగింగ్ చేసిన, డ్రగ్స్ తాగినట్టు తెలిసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు ఎంతో భవిష్యత్ ఉందని ర్యాగింగ్, డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. అదే విధంగా విద్యార్థినులను సైతం వేధించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, ఏఎస్సై దీలిప్ కుమార్, కళాశాల పీడీ అనిత, అధ్యాపకులు రాణి, నర్సింగ్ రావ్, రవీందర్ ఉన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎన్సీసీ క్యాడెట్లు వ్యాసరచన, రంగోలి పెయింటింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని అన్నారు. ప్రతి విద్యార్థి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని, అప్పుడే సరైన విషయ అవగాహన జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, సీనియర్ అధ్యాపకులు రఘు, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

## ఆలయాల నిర్మాణ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లోని శివాలయం, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం భూమిపూజను చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించేలా చూస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-రెబ్బెన



ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలో తనిఖీలో భాగంగా పులికుంట వాగు సమీపంలో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా వాగుల నుంచి ఎలాంటి పరిమితులు లేకుండా 10 ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ఇసుకను డంపు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. జిల్లాలోని అధికారుల దృష్టికి రావడంతో మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖలు విస్తృత తనిఖీలు చేస్తున్నాయన్నారు. పరిమితులు లేకుండా 10 ట్రాక్టర్లతో డంపు ఏర్పాటు చేసుకొని ఇతర జిల్లాలకు ఇక్కడి నుండి ఇసుక రవాణా చేస్తున్నట్లు మాకు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



బ్యాంకు ఖాతాదారులు బీమా పథకాలను కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాస్పెల్లి శాఖ మేనేజర్ సాయి కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతపెల్లి గ్రామానికి చెందిన తెలిగే పెంటయ్య ఇటీవల అనారోగ్యతో మృతిచెందగా గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద రూ. 430 బీమా కట్టడంతో నామిని అతని భార్య తెలిగే పోషక్కకు రూ. రెండు లక్షల బీమా పరిహారం చెక్కును అందజేశారు. ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవడం వలన వ్యక్తికి ఏమైనా జరిగి మరణిస్తే భీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు ప్రవీణ్, దస్తి రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్



నవ తెలంగాణ-వాంకిడి

గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్టు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పెంద్రం శ్యామ్ రావు రొంపెల్లి (తిర్యాణి), బోయ భాస్కర్ గడ్చిరోలి(మహారాష్ట్ర)కు చెందిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని తనిఖీ చేయగా వారి వద్ద 620 గ్రాముల గంజాయి లభించింది. దీంతో వారిని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయిని రూపుమాపడంలో భాగంగా ఎవరైనా గంజాయి సాగుచేసిన, రవాణా చేసిన, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గంజాయిని విక్రయిస్తున్నట్లయితే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు. మండలంలో గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పూలాజీ బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించనున్న పూలాజీ బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం పూలాజీ బాబా జయంతి ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీఓ లోకేశ్వర్ రావు, పూలాజీ బాబా ట్రస్ట్ అధ్యక్షులు ఇంగ్లె కేశవరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలాజీ బాబా జయంతి ఉత్సవాలను జైనూర్ మండలం పట్నాపూర్‌లోని పూలాజీ బాబా సంస్థానంలో ఈ నెల 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, ట్రస్ట్ ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, కెరమెరి, జైనూర్ మండలాల నుండి భక్తుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేయాలని, వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, సంచార మూత్రశాల, సౌచాలయాల వాహనాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, పారిశుధ్య పనుల నిర్వహణకు అధిక సంఖ్యలో కార్మికులను నియమించాలని, పారిశుధ్య కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. భోజనాల వద్ద క్యూ లైన్లు పాటించే విధంగా భారీ గేట్లు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని, సంస్థానానికి వెళ్లే రహదారులను మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించాలని, వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా దోమల వృద్ధిని అరికట్టేందుకు సంస్థానం పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ పిచికారి చేయాలని తెలిపారు. వేడుకల రోజున దర్శనం కోసం ప్రముఖులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలన్నారు. అనంతరం జయంతి ఉత్సవాలకు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం పాల్గొన్నారు.

## సీహెచ్‌పీని సందర్శించిన జీఎం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీని బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం ఎం.శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. రవాణా, పరిసరాల్లో నీటినిచల్లె విధానాన్ని, ఆన్‌లైన్ మానిటరింగ్‌ను చూసి సిబ్బందిని అభినందించారు. ఉత్తమ సీహెచ్‌పీగా అవార్డు అందుకున్నందుకు అధికారులు, ఉద్యోగులను అభినందించారు. సీహెచ్‌పీ ఆవరణలో గతంలో నాటిన మొక్కలను వృక్షాలుగా పెంచి పరిరక్షిస్తున్న తీరును తెలుసుకున్నారు. మెరుగైన పనితీరు, రక్షణ, రవాణా కోసం పలు సూచనలు చేశారు. తొలిసారి జీఎం రావడంతో ఉద్యోగులు జీఎంను సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ బీంరావు జాడే, సీహెచ్‌పీ హెచ్‌ఓడీ కోటయ్య, ఈఈ రాజు పాల్గొన్నారు.

## కథల పుస్తకాలు ఉపయోగించాలి

నవతెలంగాణ-రెబ్బెన

పిల్లలలో చదివే అలవాటును పెంచటానికి కథల పుస్తకాలను ఉపయోగించాలాని మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని నవేగాం ఎంపీపీఎస్ పాఠశాలలో రీడింగ్ కాంపేన్ నిర్వహించి కథను వివరించారు. చిన్న పిల్లలకు బొమ్మలు చూపి మాట్లాడించాలని, అక్షరాలు, పదాలను ఆటపాటలతో నేర్పించి వారిని స్వతంత్ర పాఠకుడుగా చేయాలని చెప్పారు. పుస్తకాలు చదవడం ద్వారా ప్రపంచాన్ని పరిచయం చేయవచ్చుని, విజ్ఞానం పెంచుకోవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం, ఉపాధ్యాయులు ప్రవీణ్, మోతెరావు పిల్లలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# నాణ్యతకు తిలోదకాలు

- అడుగడునా గుంతలే
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేయాలని వేడుకలు

పాలకుల పట్టింపులు లేని తనం..అధికారుల నిర్లక్ష్యంతోడు కావడంతో పది కాలాల పాటు చెక్కు చెదరకుండా ఉండాల్సిన ప్రధాన రహదారులు మున్నాళ్ల ముచ్చటగా మారిపోతున్నాయి. రోడ్డు పనులను కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారులు ఇష్టారాజ్యంగా తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారనే దానికే నిదర్శనమే కెరమెరి నుండి అసిఫాబాద్‌కు వెళ్లే రహదారి....



ధనోర వద్ద గుంతల మాయంగా మారిన రోడ్డు



సుర్దాపూర్ సమీపంలో ఏర్పడిన పెద్ద గుంత

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాహనకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. లింగాపూర్, సిర్పూర్ (యు), జైనూర్, కెరమెరి మండలంలోని వివిధ గ్రామాల చెందిన ప్రజలు పనుల నిమిత్తం రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఆరేండ్ల క్రితం పూర్తి చేసిన ఈ రోడ్డు ప్రస్తుతం అధ్వానంగా మారింది. రోడ్డు పొడవున కంకర తేలి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికి రోడ్డుపై ఏర్పడిన గుంతలన్నీ నీటితో నిండి పోతున్నాయి. ఈ గుంతలు రోడ్డు పొడవునా మోకాళ్ళ లోతు నీటితో నిండి ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో వర్షం కురిసిన రోజుల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. అనేక సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయి గాయాల పాలైన సంఘటనలున్నాయి. ప్రాణాపాయ సంఘటనలు చోటు చేసుకోక ముందే మరమ్మత్తులు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**అడుగడునా గుంతలే**

కెరామెరి నుండి ఆసిఫాబాద్ వరకు సుమారు 30 కిలోమీటర్లు ఉంటుంది. సంబంధిత అధికారులు చూసి చూడనట్టు ఉండడంతో గుత్తేదారులు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై అడుగడునా గుంతలు ఏర్పడడంతో పరిసర గ్రామాలకు చెందిన వాహదారులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరుచు పాడై పోతున్నాయి. దీంతో వాహన దారుల జేబులు గుల్లవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కెరమెరి నుంచి అసిఫాబాద్ వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### మరమ్మతులు చేపట్టాలి

**పార్ల వెంకటేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు**



గుత్తేదారులు రోడ్డు పనులు నిబంధనలకనుగుంగా చేపట్టలేదు. దీంతో పది కాలాలు మాన్నికగా ఉండే రోడ్లు అధ్వాన్నంగా మారుతున్నాయి. ఎలాంటి ప్రాణాపాయ సంఘటనలు చోటు చేసుకోక ముందే రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

### ప్రయాణం కష్టంగా ఉంది

**మొహార్లే సుధాకర్, గోయాగాం**



నేను కెరమెరిలో జనరల్ స్టోర్ దుకాణం నడుపుతున్నాను. ఆరేండ్లుగా గోయాగాం నుంచి కెరమెరికి రాకపోకలు కొనసాగిస్తున్నాను. రోడ్డు పొడవునా మోకాళ్ళ లోతు గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే చాలు గుంతలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ద్విచక్ర వాహనంపై రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డుపై ప్రయాణం కష్టంగా ఉంది.

## గెస్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి



ధర్నాలో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న గెస్ట్ అధ్యాపకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రెన్యువల్ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని అతిథి అధ్యాపక సంఘం (2152) జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల మారుతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్ నుండి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012 నుండి ప్రభుత్వ కళాశాలల్లో అతిథి ఆధ్యాపకులుగా పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతి సంవత్సరం రెన్యువల్ ఉత్తర్వుల కోసం ఎదురుచూసి సంవత్సరంలో 8 నెలలు మాత్రమే వేతనం తీసుకుంటూ అకాడమిక్ సంవత్సరం మొత్తం పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రస్తుతం రెగ్యులర్ అధ్యాపక నియామకంతో తమ ఉనికి ప్రశ్నార్ధకంగా మారిందని అన్నారు. రెగ్యులర్ నియామకాలతో సంబంధం లేకుండా తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.42 వేలు వేతనాలు చేసి 12 నెలలు అందించాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని కళ్యాణికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కృష్ణమూర్తి, రాము, యాదగిరి, సత్యం, భిక్షపతి, రాంబాబు, శ్రీకాంత్, స్వాతి, అశ్విని, మౌనిక, సునీత, ఉదయశ్రీ పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్
- రెబ్బెన సహకార సంఘం పాలకవర్గాన్ని రద్దు చేయాలి



రైతు వేదిక ఎదుట నిరాహార దీక్షలో బీజేపీ నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

అర్హులైన రైతులందరికీ రూ. రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు రైతు సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన అధికారులు పాలకవర్గంపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయం ఎదుట నిరాహార దీక్షా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోకి రావడానికి రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కొర్రిల పేరుతో కేవలం 30 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని ఆరోపించారు. 70 శాతం రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రెబ్బెన సహకార సంఘంలో పాలకవర్గ సభ్యులు అవినీతికి పాల్పడ్డారని, రైతులకు తెలియకుండానే వారి పేరు మీద అప్పులు, చనిపోయిన రైతులను పేరుమీద లోను రెన్యువల్ చేసి రైతు రుణమాఫీలను కాజేశారన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు బీజేపీ తరపున ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేవారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు గుల్బం చక్రపాణి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, జగన్నాథ ఓదెలు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, మండల అధ్యక్షులు డోంగిరి నందకిషోర్, గోలేటి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేష్, ఉపాధ్యక్షులు జటంగుల శ్రీశైలం, పోతురాజుల నారాయణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి




నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి అన్నారు. శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని వివిధ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బకాయి పడిన కరువు భత్యం వెంటనే మంజూరు చేయాలని, పీఆర్సీ నివేదికను తప్పించుకుని జాప్యం లేకుండా అమలుకు ప్రభుత్వం ముందుకు రావాలని, 5571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని, 317 బాధితుల అప్పీల్స్ పరిష్కరించి సొంత జిల్లాలకు ఉపాధ్యాయులను పంపాలన్నారు. సీపీఎస్ విధానం ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగుల జీవితాలను కార్పొరేట్లకు ఈ ప్రభుత్వాలు తాకట్టు పెట్టడం సరైంది కాదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు హరీష్, మండల బాధ్యులు సాయికుమార్, పద్మజ, బాజికాన్ పాల్గొన్నారు.

## ఆర్‌ఓఆర్ ముసాయిదాపై సలహాలు అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై సూచనలు, సలహాలు అందజేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావులతో కలిసి నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై విశ్రాంత రెవెన్యూ అధికారులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, నిపుణులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్‌ఓఆర్ ముసాయిదా బిల్లుపై నిపుణులు అందించిన ప్రతి సలహాను సీసీఎల్ఏకు నివేదించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి నూతన చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో అమలు జరుగుతున్న భూ రికార్డులు, నిర్వహణ పద్ధతులను పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లును రూపొందించిందని తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, భూ రికార్డుల నిర్వహణకు మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు తమ సలహాలు, సూచనలను వ్రాతపూర్వకంగా కలెక్టరేట్ కార్యాలయంలో అందిస్తే వాటిని ఒక నివేదిక రూపంలో తయారుచేసి సీసీఎల్ఏకు అందిస్తామని తెలిపారు. ఈ క్రమంలో విశ్రాంత తహసిల్దార్లు, పలువురు మేధావులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు తమ సలహాలను, సూచనలను వెల్లడించారు. గ్రామాలలో ఆబాది భూముల రికార్డులను ఆధునీకరించడం, సాదా బైనమా, భూముల రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేయడం, అనుభవదారుడి కాలమ్ ఉండడం, అప్పీల్ అథారిటీ ఆర్డీఓకు ఉండాలని, నూతన చట్టం అమలుకు ప్రతి గ్రామానికి రెవెన్యూ ఉద్యోగి ఉండే విధంగా చర్యలు తీసుకోవడం, భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో అప్పిలేట్ అథారిటీ ఉండేవిధంగా చర్యలు తీసుకోవడం, ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనుల హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చట్టాన్ని రూపొందించడం వంటి పలు విధాలుగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నూతన ప్రిన్సిపాల్‌గా రాందాస్

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా రాందాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సంపత్‌కుమార్ వరంగల్ జిల్లాలోని నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడికి వచ్చిన రాందాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా అధ్యాపకులు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతించారు.

## కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా శ్రద్ధ శుక్లా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా శ్రద్ధ శుక్లా నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని సబ్ డివిజన్‌లకు ఆర్డీఓ హోదా కాకుండా ఐఏఎస్ అధికారి స్థాయితో సబ్ కలెక్టర్ నియామకానికి సంబంధించి గతంలో ఉత్తర్వులు వెలువడగా శుక్రవారం ఐఏఎస్ అధికారిని శ్రద్ధ శుక్లాను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## ఓటరు జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కాసిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ సాధారణ ఎన్నికల్లో భాగంగా గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ అనుసరించి టీ పోల్ వెబ్‌సైట్‌లో వార్డుల వారీగా నమోదు కార్యక్రమాన్ని డీఎల్‌పీఓ, మండల పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్ రాజేందర్ పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తంగళ్ళపల్లి పాఠశాలలో మండల స్థాయిలో నిజాం ఇనిస్టిట్యూట్ ఫిజియోథెరపిస్టులు మహేష్, వెంకటరమణ శుక్రవారం ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ఫిజియోథెరపీపై అవగాహన పెంపొందించుకొని ఉపాధ్యాయులు ఆరోగ్యాన్ని, నొప్పులను తగ్గించుకోవాలని సూచించారు. ఫిజియోథెరపిస్టులు మహేష్, వెంకటరమణ ఉపాధ్యాయులకు సంబంధించిన పలు నొప్పులను ఫిజియోథెరపీ ద్వారా ఎలా తగ్గించుకోవచ్చో తెలియజేశారు. అదేవిధంగా మొబైల్ ఫోన్ వల్ల కలిగే దుష్పరిణామాలు, రేడియేషన్‌ను ఎలా తగ్గించుకోవాలో వివరిస్తు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మల్లేశం, తాండూర్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, మండలంలోని హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అవగాహన సదస్సులు ఏర్పాటు అభినందనీయం



నవతెలంగాణ-నస్పూర్

మహిళల రక్షణపై ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమని సీసీసీ ఎస్ఐ సుగుణాకర్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని రేడియంట్ హైస్కూల్లో అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ఎంఆర్పీ సభ్యులు సింధుతో కలిసి పాల్గొని మాట్లాడారు. మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తల్లిదండ్రులు పిల్లలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, షీ టీంలను సంప్రదించాలన్నారు. మహిళలకు పూర్తి భద్రత కల్పించడానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలని అన్నారు. ఈ అవగాహన సదస్సులో పాఠశాల కరస్పాండెంట్ రజిని, మండల విద్యా వనరుల కేంద్రం సభ్యులు, విద్యార్థులు, ఏఐఎస్‌బీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి పంటల పరిశీలన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కనికలాపూర్ గ్రామంలో పత్తి పంటను క్షేత్ర సందర్శనలో భాగంగా ఏఓ చల్ల ప్రభాకర్ సందర్శించారు. ప్రస్తుతం పత్తి పంట శాకీయోత్పత్తి దశ నుండి మొగ్గ దశలో ఉందని, ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగులు పచ్చ దోమ, తెల్ల దోమ ఉందన్నారు. వీటి నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమీడాక్లోప్రిడ్ 80 మల్లీ లేదా ఫ్లూనికామైడ్ 75 గ్రాము ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

## ఉద్యోగ విరమణ అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

కార్పొరేట్ జనరల్ మేనేజర్‌గా పని చేసిన మోహన్ రెడ్డి ఆగస్టు 31న ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ టీ.శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ జీఎం సన్మానించారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయనకు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో 41 సంవత్సరాలు సుదీర్ఘ కాలంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న మోహన్ రెడ్డి సింగరేణి సంస్థ అభివృద్ధిలో తమ వంతు కృషి చేశారని, ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరారు. కార్యక్రమంలో జీఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రాఘు కుమార్, ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే.వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇందారం ఉపరితల ప్రాజెక్ట్ ఆఫీసర్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్ సింగ్, రాముడు, శ్రీధర్, డీవై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, ఏరియా ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఐటీ ప్రొగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో జాతీయ స్పేస్ డే

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్పేడ్ డే సంధర్భంగా క్విజ్, స్పీచ్, పేయింటింగ్స్, చంద్రయాన్-3 మోడల్స్ పోటీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య జాతీయ స్పేస్ డే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉనాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించాలి

- చెన్నూర్ ఆస్పత్రిని సందర్శించిన సీపీఐ(ఎం) బృందం



నవతెలంగాణ-మంచిర్యాల

చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు వసతులు కల్పించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి పరిసరాల పరిశుభ్రత, వైద్యులు రోగులకు చికిత్స అందించే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేమనపల్లి, కోటపల్లి, బీమారం నుంచి వైద్యం కోసం రోగులు చెన్నూర్‌లోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రికి విష జ్వరాలు, అంటూ వ్యాధులతో వస్తున్నారని, రోగులకు వైద్యం అందించేందుకు సరిపడ వైద్య సిబ్బంది లేరన్నారు. ఆస్పత్రి పరిసరాలు అపరి శుభ్రంగా ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో అధికారులు వైద్యం అందించక పోవడంతో ఇంత దూరం ప్రజలు వస్తున్నారని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో ఉండే హెల్త్ సెంటర్స్‌లో సిబ్బంది లేకపోవడంతో గ్రామ స్థాయిలో ఉండే వారికి వైద్యం అందటం లేదని వాపోయారు. పేదలకు భరోసా కల్పించాల్సిన వైద్యశాఖ అధికారులు ప్రభుత్వ వైద్యంపై చిన్న చూపు చూడటంతో ఇలాంటి పరిణామాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులు వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి గ్రామ స్థాయిలో ఉన్న హెల్త్ సెంటర్‌లకు వైద్యులు, సిబ్బందిని నియమించాలన్నారు. పేద ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సమీక్ష ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సామల ఉమరాణి, సిడాం సమ్మక్క, నగేష్, మధుకర్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాస్ అధ్యక్షతన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ పాల్గొన్నారు. 14 గ్రామ పంచాయతీల నివేదికలు సోషల్ ఆడిట్ డీఆర్పీలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ మస్టర్‌లలో కొట్టి వేతలు, కూలీల సంతకాలు, హరితహారం రిజిస్టర్‌లు, ఎంబీ నిర్వహణ లో వర్క్‌ఫైల్‌లు పూర్తి స్థాయిలో లేవన్నారు. నాటిన మొక్కలకు బ్రతికిన మొక్కల మధ్య తేడాలున్నవని గుర్తించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న పంచాయితీ కార్యదర్శులకు, సాంకేతిక క్షేత్ర సహాయకులుకు జరిమానాతో పాటు షో కాజ్ నోటీస్‌లు ఇచ్చారు. ఇలాంటివి పునరావృత్తం కావద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్ రెడ్డి, గత ఎంపీడీఓ లక్ష్మయ్య, విజిలెన్స్ అధికారి కిరణ్, సీఎల్ఆర్పీ సురేష్, ఏపీఓ సత్య ప్రసాద్, ఈసీ మధుకర్, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సామజిక తనఖీ బృందం పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు, బదిలీలు సహజమేనని ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తగా వచ్చిన మండల అధికారులకు, బదిలీపై వెళ్లిన ఉద్యోగులు, మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మీయ వీడ్కోలు, ఆహ్వాన సన్మాన సభ నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగం చేసే సమయంలో ప్రజలకు చేసిన సేవలే గుర్తుండిపోతాయన్నారు. ఈ సందర్భంగా సాధారణ బదిలీల ప్రక్రియలో మండలం నుండి బదిలీపై వెళ్లిన ఎంపీఈఓ రమేష్, పంచాయతీరాజ్ ఏఈ సతీష్, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వీవీ రావు, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎస్‌కే ఎజాజ్, ప్రసాద్, ఆఫీస్ సబార్డినేట్ శ్రావణ్, ఖాజ, అలాగే ఇతర జిల్లాల నుండి బదిలీపై వచ్చిన ఎంపీఈఓ జలంధర్, రోటిగూడ, హాస్టల్ తండా, రాంపూర్, ధర్మారం గ్రామ పంచాయతీల కార్యదర్శులను పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శిల సంఘం అధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్, ఏపీఓ రవీందర్, ఈఓపీఆర్డీ జలంధర్, ఈసీ విలాస్ పాల్గొన్నారు.




# డ్రగ్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ-మందమర్రి

మాదకద్రవ్యాల దుర్వినియోగం, గంజాయి అక్రమ రవాణా అంశాలపై రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ప్రయివేట్ ఉన్నత పాఠశాలలకి యాంటి డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని 15 ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకి ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ మల్లేశం, వివిధ పాఠశాలల హెచ్ఎం, ఉపాధ్యాయులు, యాంటీ డ్రగ్స్ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**జన్నారం :** మండలంలోని తపాలాపూర్, రాంపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సందర్భంగా ఎస్సై రాజ వర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు మారకద్రవ్యాల వైపు మొగ్గు చూపకుండా మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల యువత నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని, ఆరోగ్యంగా క్షీణిస్తారన్నారు. అలాంటి వాటి జోలికి వెళ్ళకూడదని విద్యార్థులకు సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తామన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

## పొలాల అమావాస్య నిర్వహణపై సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెంలో శుక్రవారం నేతకాని మహర్ కుల సంఘం సమావేశం నిర్వహించారు. పొలాల అమావాస్య వచ్చే నెల 2, 3 తేదీల్లో 2 రోజులు సందర్భంగా పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించడానికి ఈ నెల 25న ఆదివారం బెల్లంపల్లిలోని ఎస్సీ కమిటీ హాల్లో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. నేతకాని మహర్ కులస్తులు, కులపెద్దల సమక్షంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. నేతకానికులు, కుల పెద్దలు అందరూ బెల్లంపల్లిలో నిర్వహించే సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు దాగం మల్లేష్, గుమస భీమయ్య, దాగం రాయలింగు, గోదారి రాయలింగు, బోర్లకుంట మధునయ్య, దాగం కొండయ్య, రాజలింగు, సుధాకర్ లింగమూర్తి, స్వామినాథ్ పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

ఎస్ఆర్పీ-3 గనిలో రక్షణ అధికారిగా పనిచేసిన శ్రీధర్(అడిషనల్ మేనేజర్) ఆర్‌జీ-3 ఏరియాలోని ఉపరితల గని-2కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గని ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ సీహెచ్.వెంకట్‌రావు మేమెంటో అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ అధికారి జి.శ్రీధర్, అడిషనల్ మేనేజరు తమ విధి నిర్వహణలో ఎంతో నిజాయితి, రక్షణతో కుడినా ఉత్పతి సాధించడంలో ఎస్ఎంపీ ఎస్ఓపీల అమలులో రక్షణ చర్యలను ఇతర విశిష్ట సేవలను అందించారాని కొనియాడారు. కార్యక్రమంలో గని సంక్షేమ అధికారి గౌస్ పాషా, అధికారులు మహేందర్, వై.ప్రేమ్ కుమార్, కే అరుణ్ కుమార్, కె. రామకృష్ణ, సాయి శ్రావణ్, పూర్ణ చందర్ పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-నస్పూర్



పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను మున్సిపల్ కమిషనర్ సతీష్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల భోజనం, బియ్యం, కూరగాయలు, వంటగదిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటగదిలో ఈగలు, దోమలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.

## గిరిజన గ్రామంలో పీఎం జన్‌మన్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీలో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పీవీటీజీల అభివృద్ధి కోసం పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధార్ కార్డు అప్‌డేషన్, కులం, నివాసం సర్టిఫికెట్ దరఖాస్తు, జన్‌ధన్ ఖాతాలు ఓపెన్ చేశారు. కేంద్రం పీవీటీజీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని వాటిని వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

## వంకాయ సాగుతో అధిక లాభాలు

- ఉద్యాన శాస్త్రవేత్త స్రవంతి



నవతెలంగాణ-తాండూర్

కూరగాయల సాగు సరళిలో వంకాయ సాగు చేసి రైతులు సంవత్సరం పొడుగునా ఆదాయం పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యానవన శాస్త్రవేత్త స్రవంతి తెలిపారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మండలం కొత్తపల్లి రైతు వేదికలో గిరిజన ఉప ప్రణాళిక-2024 క్రింద గిరిజన రైతులకు సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులతో వంకాయ సాగు విధానాల గురించి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులతో చర్చించి వివిధ కూరగాయ పంటలలో రైతులకు శాస్త్రీయ సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త యు.స్రవంతి మాట్లాడుతూ సరైన నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టి వంకాయలో అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ముఖ్యంగా తెల్ల దోమ, పచ్చ దోమ ఉధృతిని తగ్గించేందుకు ఎరువుల యాజమాన్యాన్ని పాటిస్తే ఎకరానికి ఎనిమిది టన్నుల దిగుబడి పొందవచ్చునని పేర్కొన్నారు. కూరగాయల రైతులు నారుమడులు పోసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మార్కెట్ సౌకర్యం గల రైతులు కాలానుగుణంగా కూరగాయల పంటలు సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో తాండూరు మండలం ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

## కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ విద్యార్థుల ర్యాలీ




నవతెలంగాణ-జన్నారం

కోల్‌కత్తాలో జరిగిన ఘటనను నిరసిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మహిళలకు రక్షణ కల్పించాలని ఫ్లకార్డులు చేత పట్టుకొని శుక్రవారం మండల కేంద్రంలో గల రాఘవేంద్ర, కరిమల జూనియర్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల నుండి బస్ స్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఎర్ర సంపత్ మాట్లాడుతూ దేశంలో మహిళలపై రోజురోజుకు జరుగుతున్న లైంగికదాడులను ఆపాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కళాశాలలో విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి వైద్య విద్యార్థికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం లక్ష్మణ్, డీన్ హేమలత షిండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రాస్ ప్లాంట్ల పరిశీలిలన



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధి ఇందన్‌పల్లి రేంజ్‌లో గ్రాస్ ప్లాంట్లను ఎఫ్‌డీపీటీ శాంతారామ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రాస్ ప్లాంట్లు విరివిగా పెంచితేనే శాఖాహార జంతువులు పెరుగుతాయన్నారు. వాటి కోసం పులి వస్తుందన్నారు. వెదురు బొంగుల నరికివేత లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట డీఎఫ్ఓ శివ ఆశీస్ సింగ్, ఎఫ్ఆర్ఓ ఆఫీఫోద్దీన్, ఎఫ్ఎస్ఓ రవి ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | 24 ఆగస్టు, 2024 | www.navatelangana.com

## చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు

నవతెలంగాణ-ముధోల్



మండల కేంద్రంలోని రభింద్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ భారతదేశం చంద్రయాన్-3 ప్రయోగం చేయడం ప్రపంచానికే తలమానికమని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శమని అన్నారు. అందుకే జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రానికి బదిలీపై వచ్చిన నూతన ఎస్సై ప్రవీణ్‌ను శుక్రవారం బోథ్ మండల ధర్మ సమాజ్ పార్టీ, మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. ఎస్సైని సన్మానించిన వారిలో బోథ్ ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు వెంకటేష్ మహారాజ్, నాయకులు ప్రవీణ్ మహారాజ్, రమేష్ మహారాజ్, భూమన్న మహారాజ్, రాజేశ్వర్ మహారాజ్ పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే దేశాభివృద్ధి

- తిమ్మాపూర్‌లో పిండి గిర్ని, ఆయిల్ మిల్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా



కలెక్టర్‌కు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలుకుతున్న ఆదివాసులు



పిండి గిర్నిని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-సిరికొండ

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన పిండి గిర్ని, ఆయిల్ మిల్‌ను ప్రారంభించారు. పల్లి నూనె తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న కలెక్టర్‌ను ఆదివాసీలు బాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మహిళల కోసం ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం ఉపాధి కొరకు పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మీ గ్రామంలో రూ.2లక్షల 30వేల వ్యయంతో పీఎంఎఫ్ఎంఈ కింద రూ.80వేల సబ్సిడీతో కొట్నక్ లక్ష్మికి బ్యాంక్ ద్వారా రూ.లక్ష నలభై తొమ్మిది వేలతో రుణాన్ని అందజేశారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా 15 రకాల సహకారాలను అందిస్తుందని అన్నారు. ఎంటర్‌ప్రైజెస్, వ్యక్తిగత రుణాలు, దుకాణాలను ఏర్పాటు చేసేందుకు మహిళ సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు. మండలంలో 219 యూనిట్లకు 6 యూనిట్లను గుర్తించామని అన్నారు. దీనితో పాటు వాతావరణానికి తగ్గట్టు మేలు జాతి గొర్రెలు, బర్రెల పెంపకానికి పాల ఉత్పత్తుల ద్వారా లబ్ధి పొందవచ్చని అన్నారు. వివిధ రకాల మినీ పరిశ్రమల కోసం బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తున్నామని అన్నారు. మహిళలు ముందుకు రావాలని అన్నారు. పీఎంఈజీపీ ద్వారా రూ.5లక్షల నుంచి 20 లక్షల వరకు రుణాలను అందిస్తుందని, యువత ముందుకు వచ్చి స్వయం ఉపాధి కోసం ఏవైనా పరిశ్రమలను ప్రారంభించుకోవచ్చని అన్నారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో రోడ్ల సమస్య ఉందని, తమ పంట పొలాల్లో మామిడి మొక్కలు నాటితే అటవీశాఖ అధికారులు తొలగించారని, చిన్న చిన్న వాటికి అటవీ శాఖ అధికారులు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రైతు రుణమాఫీ ద్వారా కొందరికి డబ్బులు జమ కాలేదని అన్నారు. ఉపాధిహామీ డబ్బులు, పింఛన్ల కోసం తపాలా కార్యాలయానికి వెళితే బీపీఎం అందుబాటులో ఉండకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అన్నారు. సమస్యలను విన్న కలెక్టర్ సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి విడతల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో మహిళ సంఘాల సమాఖ్య సమావేశంలో పాల్గొని వారితో చర్చించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మహిళల ప్రాముఖ్యత, గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాల్లో పాల్గొని, గ్రామస్తులను భాగస్వామ్యం చేయడానికి కృషి చేయాలని అన్నారు. అలాగే విద్యార్థులకు యూనిఫాంలను కుట్టి ఇవ్వడం ద్వారా ఆర్థిక చేయుత అందుతుందా లేదా అని వారిని అడిగారు. దీంతో మహిళ సభ్యులు ఇప్పటి వరకు కుట్టిన మొదటి విడత యూనిఫాంలకు డబ్బులు రాలేదని చెప్పడంతో, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అయిదు రోజుల్లో మీ డబ్బులు జమ అవుతాయని అన్నారు. మండల సమాఖ్య నూతన భవనాన్ని మంజూరు చేయాలని, సభ్యులు కోరడంతో అక్కడే ఉన్న అధికారులతో స్థలాన్ని పరిశీలించి, నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఓ సాయన్న, డీపీఆర్వో తిరుమల, ఐటీడీఏ డీఈ సాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఉపేందర్, ఇన్‌చార్జీ ఎంపీడీఓ రవీందర్, ఇన్‌చార్జీ ఎంఈఓ ఉదయ్‌రావ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్, ఏఈఓలు ప్రవీణ్, రోషిణి, మాజీ ఎంపీపీ అమృత్‌రావ్, మాజీ సర్పంచ్‌లు అనిల్ కుమార్, రఘురాం పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అవసరం

- జిల్లా జడ్జి ఎంవీ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరమని జిల్లా జడ్జీ ఎంవీ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జీ యువరాజ, జూనియర్ సివిల్ జడ్జీ అనంత లక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ చెట్లతో సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి చెట్లు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్, సంఘం సభ్యులు సతీష్ బాబు, టి.సురేష్, ఎం.సురేష్, చంద్రకుమార్, రాజీవ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి నిర్మల్ టైగర్స్ ట్రోఫీ-2024 క్రికెట్ పోటీలు

- పోటీలను ప్రారంభించిన ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నిర్మల్ టైగర్స్ ట్రోఫీ-2024 క్రికెట్ పోటీలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల శుక్రవారం ప్రారంభించారు. మొదటి బంతిని ఆడి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొత్తం జిల్లా పోలీసు యంత్రాంగాన్ని పది టీమ్‌లుగా విభజించటం జరిగిందని తెలిపారు. పోలీసు సిబ్బంది ఎప్పుడు శాంతిభద్రతల పనుల్లో బీజీగా ఉంటారని, వారి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించటానికి ఈ క్రికెట్ టోర్నమెంట్‌ని నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్‌లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని బోరిగామ ప్రాథమిక పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చంద్రాయన్‌పై చిత్రా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికాంత్ మాట్లాడుతూ విద్యార్థులలో అంతరిక్ష పరిజ్ఞానం పెంపొందించుటకు ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, దీనిని తయారు చేసిన విద్యార్థును అభినందించారు. విజ్ఞాన శాస్త్రం విలువలు పెంపొందించి, చదువు పట్ల ఆసక్తి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నిఖిలేష్, ఉపాధ్యాయులు వినోద్ కుమార్, కృష్ణమోహన్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్‌రూరల్ వ్యవసాయాధికారిగా అశ్రఫ్ 14 సంవత్సరాలు పనిచేసి బదిలీపై జైనథ్ వెళ్లారు. ఆయన స్థానంలో నిజమాబాద్ జిల్లా నుంచి బదిలీపై ఆదిలాబాద్ వ్యవసాయాధికారిగా నగేష్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈఓలు స్వాగతం పలికారు. రుణమాఫీపై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు రుణ ఖాతా ఒకటే పేరు ఉండాలన్నారు.

## వాహన పత్రాలు కలిగి ఉండాలి

నవతెలంగాణ-తాంసి

వాహనాల యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని ఎస్సై శివరాం వాహన యజమానులకు సూచించారు. శుక్రవారం అంతర్రాష్ట్ర రహదారి వడ్డాడి ఎక్స్‌రోడ్ సమీపాన తమ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలతో పాటు హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు. సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ మోటార్ సైకిల్ నడిపే వారికి హెల్మెట్ తప్పకుండా ధరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాలు తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దన్నారు. మద్యం తాగి నడపడం వల్ల తమ కుటుంబంతో పాటు మరో కుటుంబం వీధిన పడుతుందన్నారు. చిన్నపిల్లలకు వాహనాలను ఇవ్వవద్దన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## రైతు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-నిర్మల్

రైతుల రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం పక్కన ధర్నా కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్‌తో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 31 తేదీ లోపు రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయకుంటే హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిరవధిక, నిరాహార దీక్ష చేపడతానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎంతమంది రైతులకు రుణమాఫీ చేశారో, శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్టంలో 60 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉంటే కేవలం 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేయడం విడ్డూరమన్నారు. రూ.49వేల కోట్లు రుణమాఫీకి ఇవ్వాల్సి ఉండగా, రూ.17వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. రాష్ట్ర మంత్రులే పూర్తి రుణమాఫీ కాలేదని చెప్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి రుణమాఫీ చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. వెంటనే ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు. లక్షల మంది రేషన్ కార్డుల గురించి ఎదురు చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రేషన్ కార్డులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతరిక్ష దినోత్సవం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత్ ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ని విజయవంతంగా పంపిన రోజుని పురస్కరించుకొని శుక్రవారం పాఠశాల క్రీడా మైదానంలో ఐఎస్ఆర్ఓ అక్షరాలను 130 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఏర్పాటు చేశారు. జయహో ఇస్రో నినాదాలతో విద్యార్థులు హోరెత్తించారు. పాఠశాలలో విద్యార్థులకు చంద్రయాన్-3పై ఉపన్యాసం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, స్వామి, రామ్‌రెడ్డి, గజానన్, సుకుమార్ పెట్కులే, సుజాత, సంజీవ్‌రెడ్డి, పీడీ నాందేవ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగిఉండాలి



నవతెలంగాణ-నేరడిగొండ

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సైబర్‌క్రైం డీఎస్పీ అసిబుల్లాఖాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా, నకిలీ లాటరీలు, రైతు పంటరుణాల మోసాలు, నమోదు కాని ట్రావెల్ ఏజెంట్లు, కాంబోడియా వంటి సౌత్ ఈస్ట్ దేశాలకు పంపడం ఉద్యోగలపై, ఫేక్ గేమ్స్, ఇతర తదితర విభాగాల నుంచి తప్పుడు సమాచారం పై మోసపోవద్దని అన్నారు. అనుకోకుండా మోసం జరిగినప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేయాలని, సైబర్ నేరాలపై నియంత్రణ గురించి తెలిపారు. అనంతరం సైబర్ నేరాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్గీకరణకు సహకరించి అభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీల వర్గీకరణకు సహకరించి ఎస్సీ జాతీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ మాల వర్గీయులకు సూచించారు. మాదిగల స్థితిగతులు తెలుసుకొనే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో చేపట్టిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ స్వతంత్రం సంపాదించి స్వర్ణోత్సవాలు నిర్వహించుకున్నప్పటికీ మాదిగల బతుకులు మారలేదన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అడుగులు కదుపుతున్న వేళ మాలలు వ్యతిరేకించడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే 59 ఎస్సీ జాతులు అభివృద్ధి చెందుతాయన్నారు. దీన్ని గుర్తించి వెంటనే మాలలు కూడా వర్గీకరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేముల పోశం, కొర్ల ప్రభాకర్, కూటికల పోశం, దుర్గం సంతోష్ కర్ణాకర్, రాము, రాజేష్ పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

గుమ్మడి కాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా కొంత మంది యువకుల వ్యవహారం ఉందని యూత్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్ యాపలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఆ అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. గురువారం కొంత మంది యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అని ప్రెస్‌మీట్ పెట్టారని, దీంట్లో మండల యువజన అధ్యక్షులు ప్రస్తుతం ఎవరు లేరని, అందరూ మాజీ అధ్యక్షులే అని తెలిపారు. ఎమ్మెల్యే వినోద్ ఫొటో లేకుండా ఆయనను గౌరవించకుండా వాట్సాప్ గ్రూప్‌లలో పోస్టులు పెడుతున్నారని, వాళ్లను ఉద్దేశించి మొన్న ప్రెస్‌మీట్ పెట్టారని తెలిపారు. వాళ్లు ఎవరనేది తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని, కాని నిన్న ప్రెస్‌మీట్ పెట్టిన కొంత మంది యువకులు గుమ్మడి కాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్టు మా నాయకున్నే అన్నారని మీ మీదే మీరే నిందలు వేసుకున్నారన్నారు. ఇకనైనా ఇలాంటి రెచ్చగొట్టే వాఖ్యలు, గ్రూపులను ప్రోత్సహించే చర్యలు మానేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మారం రాజకుమార్ యాదవ్, చంటి, సంపత్ పాల్గొన్నారు.

## వినియోగదారుల రక్షణకు ప్రాధాన్యత నివ్వాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కల్తీ ఆహార పదార్థాలు అందించకుండా వినియోగదారుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని వినియోగదారుల హక్కుల రక్షణ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. సభ్యులతో కలిసి అదనపు కలెక్టర్ దాసరి వేణును మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలు, హోటల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లలో శుభ్రత పాటించాలన్నారు. కల్తీలు, నకిలీ వస్తువులు వాడకూడదన్నారు. ఎక్కడైనా అటువంటివి కన్పిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌పెక్టర్ రాజు, సంస్థ ప్రధాన కార్యదర్శి షేక్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## ఎస్ఆర్పీ-1 గనిని సందర్శించిన గుర్తింపు సంఘం నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా గనిని సందర్శించి వివిధ డిపార్ట్మెంట్లో ఉన్న కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం పంపిణీ చేసిన బూట్లు నాసిరకంగా ఉన్నాయని, రెండు నెలలకే బూట్లు చిరిగిపోతున్నాయని తెలిపారు. దీంతో కార్మికులు అసంతృప్తిగా ఉన్నారని, వెంటనే నాణ్యమైన బూట్లను అందించాలన్నారు. గనిలో పాత రూఫ్ బోల్టు మిషన్లను వాడటం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు సరిపడా వస్తువులను సరఫరా చేయడం లేదని, వెంటిలేషన్ సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఫిట్ సహాయ కార్యదర్శి కామెర వేణు, పరశురాములు, ప్రసాద్, వంశీ, రాజు పాల్గొన్నారు.

## జీఎంను సన్మానించిన అధికారులు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా సందర్శనకు వచ్చిన జీఎం(సీఎంసీ)ని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ ఏరియా అధికారులతో కలిసి సన్మానించారు. జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయనను శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రాజమల్లు, పీఓ నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల హై స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలతో పాటు వంట గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నిర్వాహకులు కూడా పిల్లలను సొంత పిల్లలగా చూసుకుంటూ వారిని నాణ్యమైన భోజనం పెట్టాలని, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గర్ల్స్ హై స్కూల్లో భోజనం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రతిమ, సులోచన, సారఖాతూన్ పాల్గొన్నారు.